నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 15 జనవరి 2024 | NIZAMABAD

ధర్మారంలో భోగి మంటలు..

బోధన్‌లో..

వైభవంగా భోగి

ఉమ్మడి జిల్లా ప్రజలు ఆదివారం భోగి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. తెల్లవారుజామునే కాలనీల్లో భోగి మంటలు వేశారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా పతంగులను ఎగురవేసి సందడి చేశారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చిన్నారులపై భోగిపండ్లు పోసి పెద్దలు ఆశీర్వదించారు.

నర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కంఠేశ్వర్, జనవరి 14: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో జపాన్, జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 22-30 వయస్సు ఉండి బీఎస్సీ నర్సింగ్/జీఎన్ఎం/ ఏఎన్ఎం, డిప్లొమో చేసిన అభ్యర్థులు జపాన్‌లో, 18-28 వయస్సు ఉండి ఇంటర్‌లో 60 శాతం ఆ పైన మార్కులు సాధించిన అభ్యర్థులు జర్మనీలో ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు tomcom.germany@gmail.com లేదా 89190 47600/95739 45684/63022 92450 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

సంబురాల సంక్రాంతి

సుభాష్‌నగర్, జనవరి 14: తెలుగు ప్రజల పెద్ద పండుగ సంక్రాంతి. గ్రామీణ సంస్కృతిలో పంటలు చేతికందిన సంతోషంలో జరుపుకొనే సంబురాల సంక్రాంతి. పితృదేవతలను స్మరించుకోవడం తమతోపాటు శ్రమించిన వారికి, పశు సంపదకు కృతజ్ఞతలు చెల్లించుకునే ముచ్చటైన పండుగ సంక్రాంతి. సౌరమాణం ప్రకారం సంక్రాంతి పుష్యమాసంలో వస్తున్నది. ఇది పాడిపంటలకు, సంపూర్ణ ఆరోగ్యానికి మంచిదని పండితులు చెబుతున్నారు. మకర సంక్రమణం లక్ష్మీదేవి ఆగమనానికి సంకేతంగా చెబుతారు. శ్రీమన్నారాయణునితో కలిసి లక్ష్మీదేవి రంగురంగుల ముగ్గుల రథాన్ని ఎక్కి వస్తుందంటారు. ఈ రోజు వేసే ముగ్గులకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. ధాన్య రూపంలో ఉన్న లక్ష్మీదేవితోపాటు సంక్రాంతి పురుషుడు బలి చక్రవర్తి ఇండ్లకు వచ్చి శుభాలను ఇస్తారనే భావనతో ప్రతి ఇంటినీ మహిళలు ఆవుపేడతో అలికి ముగ్గులు పెట్టి పసుపు కుంకుమలతో గడపను అలంకరిస్తారు. గొబ్బెమ్మలను తయారుచేసి కూరపిండి నువ్వులు, రేగుపండ్లు, ముగ్గుల్లో ఉంచుతారు. చిన్నపెద్ద తేడాలేకుండా పాటలు పాడతారు. హరిదాసుల రాక, ఘుమఘుమల పిండివంటలు, రంగవల్లులు, గాలిపటాల సందడితో సంబురాల సంక్రాంతి ప్రజల్లో ఆనందోత్సాహాన్ని కలిగిస్తుంది.

ఆలయాల్లో నేడు ప్రత్యేక పూజలు

సంక్రాంతిని పురస్కరించుకొని వైష్ణవ, శైవ ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ తెలిపారు. మకర సంక్రమణ వేళ ఉత్తరాయణ పుణ్య కాలంలో అర్చన హారతులతో పాటు ప్రత్యేక పూజలు చేస్తే పుణ్యం వస్తుందని పలు పురాణాలు చెబుతున్నాయని, అందుకే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వివరించారు.

- పతంగులతో చిన్నారుల ఆనందం
- సందడి చేయనున్న హరిదాసులు.. ప్రత్యేక ఆకర్షణగా బసవన్నలు
- రేపు కనుమ

కనుమ...

మకర సంక్రాంతి తర్వాతి రోజు కనుమ పండుగ వస్తుంది. దీనిని పశువుల పండుగ అని పిలుస్తారు. పల్లెల్లో పేదలకు పశువులే గొప్ప సంపద. అవి ఆరోగ్యంగా ఉంటే పాడి రైతుకు ఉత్సాహం. పంటల్లో వీటి పాత్ర ఎంతో ఉంటుంది. వాటిని ప్రేమగా చూసుకునే రోజుగా కనుమ పండుగగా భావిస్తారు. అందుకే కనుమ రోజు పల్లెల్లో రైతులకు వ్యవసాయంలో సహకరించే పశువులను పూజించడం ఆచారం. పశువుల పాకలను చక్కగా అలంకరించి అక్కడ పాలు,కొత్త బియ్యంతో పొంగలి వండుతారు. ఆ పొంగలిని దేవుళ్లకు నైవేద్యం సమర్పించి తర్వాత పొలానికి తీసుకెళ్లి చల్లుతారు. దీనిని పాలా చల్లడం అంటారు.


స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొన్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

కన్నుల పండువగా గోదా కల్యాణోత్సవం

నస్రుల్లాబాద్, జనవరి 14: బీర్కూర్ గ్రామ శివారులో ఉన్న తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆదివారం గోదా దేవి-రంగనాథ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి దంపతులు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించగా పోచారం పాల్గొన్నారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో భోగి మంటలు వేశారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఇస్లావత్ కృష్ణ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోచారం శంభు రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సతీశ్, మద్దినేని నాగేశ్వర్ రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రజలకు పోచారం సంక్రాంతి శుభాకాంక్షలు

బాన్సువాడ, జనవరి 14: ఉమ్మడి జిల్లా ప్రజలకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సకల సంపదలతో సంక్రాంత్రిని, కన్నుల పండువగా కనుమను జరుపుకోవాలని ఆకాంక్షించారు. భోగి మంటలు, గాలిపటాల సందడితోపాటు తెలంగాణ సంప్రదాయ సకినాల పిండివంటలతో మూడు రోజులు కోలాహలంగా ఉంటుందని తెలిపారు. ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కళాకారిణుల నృత్య ప్రదర్శన

పురాతన ఆలయాలను కాపాడుకోవాలి

భిక్కనూరు, జనవరి 14: పురాతన ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర ఆలయ ప్రాంగణంలోని కోనేరు సమీపంలో ఓం నమఃశివాయ, భరతనాట్య కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పురాతన కట్టడాలను పునరుద్ధరించడంతో భావితరాలకు వాటి ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. భోగి పండుగ రోజు కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉన్నదన్నారు. కోనేరు పునరుద్ధరణకు కృషి చేసిన దాతలు కావూరి కల్పన, రమేశ్‌ను అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ పాడు బడిన బావులను పునరుద్ధరించడంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అనంతరం పరంపర సౌజన్యంతో శంకరానంద కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఓం నమః శివాయ , భరతనాట్య కార్యక్రమాలు నిర్వహించారు. శివ పార్వతుల నృత్యం, భరత నాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.